వైభవంగా పైడితల్లి అంబలం పూజ



మండపం ముందు దీక్షాధారులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత విజయనగరం పైడితల్లి అమ్మవారి అంబలం పూజ శుక్రవారం రాత్రి స్థానిక కోట కూడలిలో భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. మెట్లతో కూడిన ప్రత్యేక మండపాన్ని అరటిదవ్వలతో తయారు చేసి తల్లిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం మూడుగంటల పాటు తల్లి గీతాలు ఆలపించారు. సుమారు 400 మంది పైడిమాంబ దీక్షాధారులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆర్.సూర్యోపాత్రో, అచ్చిరెడి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ● పైడితల్లి జాతరను పురస్కరించుకుని చదురుగుడి ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

నిబంధనల మేరకే ఇసుక తవ్వాలి

● జడ్పీ సమావేశంలో మంత్రులు



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు, చిత్రంలో మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం రెండో సారి శుక్రవారం జరిగింది. ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మన్యం జిల్లా జేసీ శోభిత, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఉభయ జిల్లాల అధికారులు హాజరయ్యారు. అజెండాలోని తొలి అంశం నుంచే సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది.

తొలుత సమావేశంలో కొందరు జడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షులు ఇసుక ఎక్కడా దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక నిల్వ కేంద్రాల్లో లేదని, నిర్మాణాలు ముందుకు సాగడం లేదన్నారు. ఉచితమన్నారు.. రవాణా ఛార్జీల పేరిట బాదేస్తున్నారన్నారు. నాటుబళ్లు, ట్రాక్టర్లపై సొంత అవసరాలకు తీసుకెళ్లవచ్చని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. పొలాల్లో తవ్వకాలపై ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మండలాధ్యక్షులు ప్రస్తావించగా మంత్రులు స్పందిస్తూ.. ఎవరి పొలాల్లో వారికే తవ్వకానికి అనుమతి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదులపై చర్యలు తప్పవన్నారు.

★ ఒడిశా నుంచి దిగుమతైన ఇసుక ధర కాస్త ఎక్కువగానే ఉందని, వానా కాలంలో రీచ్‌ల నుంచి తీయలేకపోయారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సొంత అవసరాలకు ఎక్కడైనా తవ్వుకోండి.. తీసుకెళ్లండి.. అని ప్రజలకు సూచించారు. ఎల్.కోట, వేపాడ మండలాల్లో ఎక్కడా ఇసుక లభ్యత లేదు.. మరి ఎక్కడ తవ్వుకొని, తీసుకెళ్లాలని ఎల్.కోట మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రశ్నించారు. నాలుగు నెలల్లో జిల్లాలో 92 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా చేశామని కలెక్టర్ చెప్పారు.



హాజరైన ప్రజాప్రతినిధులు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

పేదలకు మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తామని గృహ నిర్మాణ సంస్థ పీడీ కూర్మినాయుడు పేర్కొన్నారు. పేదల ఇళ్ల పనులకు ఉచితంగా ఇసుక అందిస్తామని మంత్రి సంధ్యారాణి అన్నారు.

★ కొత్తవలస మండలంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ రావడంతో ఇళ్ల పట్టాలు ఆపేశారని, దేవాడలో పట్టాలిచ్చినా నీటి సౌకర్యం లేక లబ్ధిదారులు నిర్మించడంలేదని జడ్పీటీసీ సభ్యురాలు శ్రీదేవి తెలిపారు. తోటపల్లి నిర్వాసితుల ఐవైఐ ఇళ్ల బిల్లులు చెల్లించాలని కురుపాం జడ్పీటీసీ కోరారు.

లస్కర్ల నియామకానికి సాయం

బాడంగి, తెర్లాం మండలాల్లో వరి పంటకు సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని.. తోటపల్లి ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి ఉండకూడదని ఛైర్మన్ సహా పలువురు సభ్యులు కోరారు. నీటి మట్టం తగ్గడంతో డిమాండ్ పెరిగిందని ఈఈ రామచంద్రరావు తెలిపారు. లస్కర్ల కొరతపై కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ రెండు మూడు నెలలు వారి నియామకానికి అయ్యే ఖర్చు సాయం అందించేలా ప్రయత్నిస్తానన్నారు.

రెండు తీర్మానాలు

తాటిపూడి జలాశయానికి గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరు పెట్టాలని, గుర్ల డయేరియా బాధితులకు ప్రభుత్వ పరంగా సాయమందించాలన్న డిమాండ్ మేరకు సభలో తీర్మానించారు.

గుర్లకు నిపుణుల కమిటీ

గుర్లలో డయేరియా మృతులపై విచారణకు కమిటీ వేశారని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. నివేదిక అనంతరం పరిహారం చెల్లిస్తారన్నారు.

కన్నేశాడు.. అమ్మేశాడు

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే: బొబ్బిలి

వైకాపా అయిదేళ్ల పాలనలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆ పార్టీ నాయకులు కబ్జాలు చేశారు. రికార్డులు తారుమారు చేసి తమ పేరిట రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. బాధితుల మొర ఆలకించేవారే కరవయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వస్తున్న అలాంటి అక్రమాలెన్నో.. తాజాగా బొబ్బిలిలో సీబీఎం బాలికోన్నత ఎయిడెడ్ పాఠశాలకు చెందిన రూ.కోట్ల విలువైన ఆస్తులు సైతం కరస్పాండెంట్ ఒక పథకం ప్రకారం వైకాపా నేతకు ధారాదత్తం చేయడం వెలుగులోకి వచ్చింది.

తెర వెనుక జరిగిందిదీ..

పాఠశాల కరస్పాండెంట్ అకాల మరణం తర్వాత కరస్పాండెంట్‌గా రత్నకుమార్ బాధ్యతలు చేపట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది డిసెంబరులో సుమారు 1.20 ఎకరాలకు అతను తన పేరిట దస్త్రాలు మార్పించుకున్నారు. తర్వాత పట్టణానికి చెందిన వైకాపా నాయకుడు టి.భాస్కరరావుకు విక్రయించారు. దీనికి బదులుగా బొబ్బిలి మండలం కోమటిపల్లిలో ఆయన విద్యాసంస్థలకు చెందిన కళాశాల భవనాలు, కొంత స్థలం బదలాయించారు. బొబ్బిలిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నా చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయ, విక్రయాలు జరిపారు. కరస్పాండెంటు హోదాలో రత్నకుమార్ పాఠశాలను తరలిస్తున్నట్లు ప్రకటించారు. చట్టవిరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని డిమాండ్లు పెరిగాయి. ఇప్పటికే కొందరు విద్యార్థులు ఇతర విద్యాసంస్థల్లో చేరారు.



బొబ్బిలి పట్టణంలో విలువైన సీబీఎం పాఠశాల భవనాలు

బొబ్బిలిలోని సీబీఎం పాఠశాలకు వందేళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ చదువుకున్న వారు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ పాఠశాల కొనసాగింపునకు 2024తో ప్రభుత్వ అనుమతులు ముగిశాయి. ఈ విద్యా సంవత్సరానికి రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అది చేయకుండా కోమటిపల్లికి తరలించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు, వామపక్ష నేతలు ఆందోళనలు చేస్తున్నారు.

తాజాగా మారిన సీను

దీనిపై స్పందించిన బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండు చేశారు. ఉప విద్యాశాఖాధికారితో కలెక్టర్ విచారణ జరిపించారు. ఆ నివేదిక మేరకు పాఠశాల స్థలాన్ని విక్రయించిన రత్నకుమార్‌ను కరస్పాండెంటుగా తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీబీఎం పాఠశాలకు ఉప విద్యాశాఖాధికారి మోహనరావును ప్రత్యేకాధికారిగా నియమించారు. ఈ వ్యవహారాన్ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి గురువారం విద్యార్థినుల తల్లిదండ్రులు, జనసేన పార్టీ నాయకులు తీసుకెళ్లారు.

ఆర్డీవోతో దర్యాప్తునకు ఆదేశం

ఈ ఆస్తుల క్రయ, విక్రయాలపై దర్యాప్తునకు బొబ్బిలి ఆర్డీవోను విచారణాధికారిగా కలెక్టర్ నియమించారు. తదుపరి రిజిస్ట్రేషన్లు జరపకూడదని జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశించినట్లు సమాచారం.

‘వైకాపా హయాంలోనే కబ్జా’

వైకాపా హయాంలోనే సీబీఎంకు చెందిన ఆస్తులు కబ్జాకు గురయ్యాయని సీబీసీఎన్‌సీ ట్రస్టు ఛైర్మన్ దీపక్ కుమార్, కార్యదర్శి రాజకుమార్ ఆరోపించారు. శుక్రవారం బొబ్బిలి సీబీఎం చర్చిలో విలేకరులలో మాట్లాడారు. విశాఖలో మాజీ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, కాకినాడలో ద్వారంపూడి చంద్రశేఖర్, బొబ్బిలిలో భాస్కరరావు దక్కించుకున్నారన్నారు. ఆస్తులు స్థానిక చర్చిలకు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజిస్ట్రేషన్ రద్దు చేయాల్సిందే

సీబీఎం పాఠశాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చట్టవిరుద్ధం, ప్రభుత్వం జోక్యం చేసుకుని రద్దు చేయాలి. - **వేమిరెడ్డి లక్ష్మునాయుడు, రై.సం.సంఘం అధ్యక్షుడు, బొబ్బిలి**

భూ బదలాయింపు చేసుకున్నాం..

సీబీఎం పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేస్తామని కరస్పాండెంట్ రత్నకుమార్ ఆశ్రయించారు. కోమటిపల్లిలోని విశాలమైన భవనాలు, స్థలాలు ఇస్తామన్నాం. భూ బదలాయింపు చేసుకున్నాం. ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. - **టి.భాస్కరరావు, స్థలం బదలాయించుకున్న వైకాపా నేత**

నేటి నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభం కానుంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గంట్యాడ మండలం నరవలో, విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. శాశ్వత- రూ.లక్ష, సాధారణ సభ్యత్వానికి రూ.100గా నిర్దేశించారు. ప్రమాదబీమా రూ.5 లక్షలు వర్తింపజేస్తారు. వాట్సాప్, టెలీగ్రామ్, ఆన్‌లైన్‌లోనూ ప్రక్రియ నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు.

వినియోగంలో లేని భూములు వెనక్కి: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న సేధు మాధవన్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: వివిధ సంస్థలు, సంఘాలకు ప్రభుత్వం కేటాయించిన భూమిని మూడేళ్లలో వినియోగంలోకి తీసుకురాకపోతే, వెనక్కి తీసుకునే అవకాశముందని జేసీ సేధు మాధవన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్షించారు. తనిఖీలు చేసి నివేదికను పంపించాలని ఆదేశించారు. త్వరలో భూముల రీసర్వే ప్రారంభమవుతున్నందున గ్రామసభలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా 15 రోజుల్లో తప్పులు సరిదిద్దాలని తెలిపారు. సర్వే రాళ్లపై రాజకీయ నాయకుల పేర్లను తొలగించాలన్నారు. ఆర్డీవోలు డి.కీర్తి, సత్యవాణి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో బాధ్యతల స్వీకరణ



దస్త్రంపై సంతకం చేస్తున్న మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా యు.మాణిక్యం నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో అధ్యాపకుడిగా పదేళ్లకు పైగా పనిచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

దారికొచ్చిన భూసేకరణ ప్రక్రియ!

★ కలెక్టర్ భరోసాతో హరిత రహదారి మార్పులకు తొలగిన అడ్డంకి



పరిహారం కోరుతూ ఎమ్మెల్యే లలితకుమారికి దరఖాస్తు ఇస్తున్న మహిళా రైతు

కొత్తవలస, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జాతీయ హరిత రహదారి నిర్మాణ ప్రక్రియకు నెలకొన్న అడ్డంకులు తొలగనున్నాయి. రహదారి అంతర మార్పుల(ఇంటర్ ఛేంజెస్) కోసం కొత్తవలస మండలం ఉత్తరాపల్లి రెవెన్యూలో ఏడాదిన్నరగా సాగుతున్న భూసేకరణ సమస్య కలెక్టర్ అంబేడ్కర్ భరోసా, ఎమ్మెల్యే లలితకుమారి చొరవతో ఓ కొలిక్కివచ్చింది. ఉత్తరాపల్లి సచివాలయంలో గురువారం ఏర్పాటుచేసిన క్లెయిముల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో రైతులు సమ్మతిస్తూ దరఖాస్తులు అందజేశారు.

జాతీయ హరిత రహదారి నిర్మాణంలో మార్పుల కోసం ఉత్తరావల్లిలో భూసేకరణకు ప్రతిపాదించిన భూములకు పరిహారం(అవార్డు) నిర్ణయించారు. ఏడాదిన్నర దాటినా కూడా సుమారు 21 ఎకరాలకు సంబంధించి 53 మంది రైతులు క్లెయిమ్‌లు దాఖలు చేయకపోవడంతో అంతర మార్పుల పనుల్లో ప్రతిష్టంభన నెలకొంది. గత ఆర్డీవో సూర్యకళ పలుమార్లు రైతులతో సమావేశమైనా స్పందనలేదు. ప్రస్తుత ఆర్డీవో దాట్ల కీర్తి రెండుసార్లు రైతులతో చర్చించి నచ్చజెప్పారు. తహసీల్దారు నీలకంఠరావు లోపాలను గుర్తించి జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి రైతుల్లో నమ్మకం కలిగించారు. మరోవైపు ఎమ్మెల్యే లలితకుమారి కలెక్టర్‌తో మాట్లాడటంతో బుధవారం విజయనగరంలో సంబంధిత రైతులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నిర్ణయించిన పరిహారంపై అదనంగా 30శాతం చెల్లించడానికి (ఆర్బిట్రేషన్) ప్రతిపాదనలు పంపడానికి, స్థిరాస్తి లేఅవుట్‌కి ఆనుకొని ఉన్న భూములకు గజాల చొప్పున పరిహారం అందించడానికి సానుకూలత వ్యక్తం చేయడంతో రైతులు క్లెయిమ్‌లు ఇవ్వడానికి సంసిద్ధత తెలిపారు.

సెంటుకు రూ.37 వేల పరిహారమా?

లేఅవుట్‌లో ల్యాండ్ కన్వర్షన్ అయిన వాటికి గజానికి రూ.5,800 పరిహారం చెల్లిస్తుండగా, రైతుల భూములకు సెంటుకు రూ.37 వేలు మాత్రమే ఇస్తున్నారని, దీన్ని సవరించి న్యాయం చేయాలని రైతులు ఎమ్మెల్యేను వేడుకున్నారు. చిన్నిపాలెం రెవెన్యూలో ఇనాం భూములు సాగుచేస్తున్న రైతులను గుర్తించి పరిహారం అందేలా చూడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు కోరారు. గాంధీనగర్ కాలనీలో ఇళ్లు కోల్పోతున్నవారికి పరిహారంతోపాటు స్థలం కేటాయించాలన్నారు. క్లెయిమ్‌లు ఇస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంపై ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచికి ముందస్తు సమాచారం లేకపోవడంపై వారు తహసీల్దారును ప్రశ్నించారు. తెదేపా నాయకులు వెంకటరమణ, దుర్గా ఉమేష్, ప్రకాష్, ఎర్రినాయుడు, లక్ష్మణరావు, వామాలు, షేక్ సయ్యద్ పాల్గొన్నారు.

పోలీసుల సేవలపై అవగాహన



పోలీసులు వాడే పరికరాలను పరిశీలిస్తున్న విద్యార్థులు



తుపాకీతో విద్యార్థిని, చిత్రంలో ఎస్పీ, ఏఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు అందించే సేవలు, ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయనగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 'ఓపెన్ హౌస్' కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు విద్యా సంస్థల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. కేసుల ఛేదనలో ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్ స్కిల్స్, డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, డ్రోన్ల ఉపయోగం, వేలిముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ గన్‌లు.. తదితర వాటి గురించి ఎస్పీ వకుల్ జిందాల్ వివరించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులు, పోలీసుల పిల్లలు, ఇతర విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

'రెండేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు'



జడ్పీ కార్యాలయానికి ర్యాలీగా తరలి వెళుతున్న విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న విద్య, వసతి దీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తొలుత చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన వారు.. జడ్పీ సర్వసభ్య సమావేశం నేపథ్యంలో అప్పటికప్పుడు వేదికను మార్చారు. ఆర్టీసీ సముదాయం నుంచి ర్యాలీగా జడ్పీ కార్యాలయానికి చేరుకుని ముట్టడించే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని లోనికి వెళ్లనీయకుండా అడ్డుకోవడంతో రహదారిపై బైఠాయించారు. సుమారు గంట పాటు నిరసన తెలిపారు. అనంతరం మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు జగదీశ్వరి, అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్ వచ్చి వారితో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, ఉపాధ్యక్షుడు రవికుమార్, సహాయ కార్యదర్శి ఎస్.సమీరా, శిరీష, కె.రమేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన



విజయనగరంలో నినాదాలు చేస్తున్న సంస్థ ఉద్యోగులు

విజయనగరం కోట, న్యూస్‌టుడే: వేతన, పింఛను సవరణలను కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం అన్యాయమని, నిర్ణయాన్ని మార్చుకుని న్యాయం చేయాలని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు డిమాండు చేశారు. ఈమేరకు శుక్రవారం విజయనగరంలోని సంస్థ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. బీఎస్ఎన్ఎల్ఈయూ, ఏఐబీడీపీఏ, బీఎస్ఎన్ఎల్ సీసీఈడబ్ల్యూఎఫ్ సమన్వయ కమిటీల పిలుపు మేరకు నినాదాలు చేశారు. సంస్థ నష్టాల్లో ఉందని, సవరణలు చేయడం కుదరదని చెప్పడం విడ్డూరంగా ఉందని సంఘం నాయకుడు వెంకటరావు మండిపడ్డారు. కేంద్ర విధానాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. 2వ వీఆర్ఎస్ అమలు చేయొద్దని, పెన్షన్, వేతన సవరణలకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. కృష్ణకుమారి, రమణమ్మ, లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడి దుర్మరణం



పి.చెల్లయ్య (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: తేనెటీగలు ఓ వృద్ధుడి ప్రాణం తీశాయి. ఈ ఘటన కొత్తవలస మండలం రాజపాత్రునిపాలెంలో జరిగింది. ఎస్సై జనార్దనరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.చెల్లయ్య(74) ఈనెల 21న ఉదయం పశువులను మేత కోసం సమీపంలోని మామిడితోటలోకి తీసుకువెళ్లారు. ఈక్రమంలో తేనెటీగల గుంపు దాడి చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య అచ్చియ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అచ్చియ్యమ్మపై కూడా దాడి చేయగా రెండు రోజుల పాటు చికిత్స పొంది కోలుకున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడిలోని గర్భాం రోడ్డు ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గర్భాం శివారులో నివాసముంటున్న సీహెచ్.రమణమూర్తి ఈనెల 15న కుటుంబంతో కలిసి విజయనగరంలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. 21న పనిమనిషి ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లగా ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి యజమానికి ఫోన్ చేసి చెప్పింది. ఆయన వచ్చి చూడగా పడక గదిలోని బీరువాలో బంగారం, వెండి వస్తువులు, నగదు, మరో గదిలోని టీవీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం నిందితులు డి.జగదీష్, బి.సోమశేఖర్‌ను విజయనగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ వద్ద పట్టుకున్నామని ఎస్సై చెప్పారు. నేరం అంగీకరించారని, ఈ కేసులో మరో బాలుడు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

ట్రాక్టరు నుంచి జారిపడి చోదకుడి మృత్యువాత

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ట్రాక్టరు పైనుంచి జారిపడి చోదకుడు మృతిచెందిన ఘటన చీపురుపల్లి మండలం పేరిపిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.అప్పలనాయుడు (45) శుక్రవారం సాయంత్రం సమీపంలోని పొలంలో ట్రాక్టరుతో దున్నుతుండగా ఒక్కసారిగా జారిపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో.. అక్కడివారు చీపురుపల్లి ప్రాంతీయాసుత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

స్నానాల గదిలో కాలు జారి వైద్యుడి మృతి

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ కాలుజారి పడడంతో ఓ వైద్య నిపుణుడు మృత్యువాత పడిన ఘటన విజయనగరంలో జరిగింది. గ్రామీణ ఎస్సై అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లాకు చెందిన పవన్‌కుమార్(44) నెల్లిమర్ల సమీపంలోని మిమ్స్‌లో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక ఊటగెడ్డ సమీపంలోని ఓ అపార్టుమెంటులో తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నారు. ఈనెల 24న స్నానాల గదిలో కాలు జారి పడ్డారు. తలకు దెబ్బ తగలడంతో మిమ్స్‌కు తరలించగా.. అదే రోజు రాత్రి చనిపోయారు. కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

కొత్తవలస, న్యూస్‌టుడే: దళిత వితంతు యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మరో యువతితో పెళ్లి ముహూర్తం నిర్ణయించుకున్న యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు మోసం కేసు నమోదు చేశామని సీఐ షణ్ముఖరావు చెప్పారు. ఆయన వివరాల ప్రకారం.. తాడివానిపాలేనికి చెందిన యువతి(30) కొత్తవలసలోని ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేస్తోంది. ఈమె భర్త 2016లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమెకు ఒక బాబు ఉన్నాడు. అప్పన్నపాలేనికి చెందిన కె.చినబాబుతో 2019లో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. గురువారం రాత్రి ఆమె మెడలో పసుపుతాడు కట్టాడు. ఈనెల 26న మరో యువతిని పెళ్లి చేసుకోవడానికి ముహూర్తం పెట్టుకున్నట్లు తెలియడంతో బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

శవ రాజకీయాలు చేయడం తగదు: కళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారానికి సంబంధించి శవ రాజకీయాలు చేయడం వైకాపాకు తగదని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుర్ల వచ్చి వీరంగం సృష్టించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంచాయతీలకు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. లేనిపోని ప్రకటనలు చేస్తున్న జడ్పీ ఛైర్మన్‌కు బాధ్యత లేదా అని నిలదీశారు. ఈనెల 24 నాటికి జిల్లాలో రూ.126 కోట్ల నిధులు పంచాయతీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు ర.భ.శాఖ ద్వారా రూ.11 కోట్లు మంజూరయ్యాయని, తోటపల్లి కుడి ప్రధాన కాలువలో పూడికల తొలగింపునకు రూ.58 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.1.03 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది ఒక రోజు వేతనం రూ.1.03 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో శుక్రవారం కలెక్టర్ అంబేడ్కర్‌కు ఇన్‌ఛార్జి ఉపకులపతి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, ఉప రిజిస్ట్రార్ కె.గంగరాజు అందజేశారు.

త్వరలో నైపుణ్య కేంద్రం

విద్యావిభాగం: విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వ విద్యాలయంలో త్వరలో నైపుణ్య కేంద్రాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ శుక్రవారం సాయంత్రం ఆయనను కలిసి అభ్యర్థించిన మేరకు సానుకూలంగా స్పందించారు. ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

4 నుంచి డైట్ పరీక్షలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 2018-20 డైట్ మొదటి ఏడాది విద్యార్థులకు నవంబరు 4 నుంచి 9 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ పగడాలమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-25 విద్యార్థులకు రెండో సెమిస్టర్ వచ్చే నెల 4 నుంచి 7 వరకు జరుగుతుందని చెప్పారు. వీటికి సంబంధించిన హాల్ టిక్కెట్లు www.bse.ap.gov.in వెబ్ సైట్‌లోఅందుబాటులో ఉన్నాయని తెలిపారు.

1న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 1న జిల్లా స్థాయి యువజనోత్సవాలను మహారాజా బీఈడీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆ విభాగం సీఈవో బి.రాంగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు గలవారు అర్హులని, సైన్స్ అండ్ టెక్నాలజీ, జానపద నృత్యాలు, గీతాలు, కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, ఫిట్ ఇండియా, డ్రోన్ల ప్రదర్శన, 5జీ టెక్నాలజీ ప్రదర్శన తదితర అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాల కోసం 82475 54334 నంబరును సంప్రదించాలని కోరారు.

29న ఉద్యోగులకు క్రీడా పోటీలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 29న విజయనగరంలోని రాజీవ్ మైదానంలో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చదరంగం, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనవచ్చని, గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి టోర్నమెంట్లకు ఎంపికవుతారని వెల్లడించారు. ఇతర వివరాల కోసం 80741 16276, 91770 70098 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	122	214	224

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

రబీ సాగుపై దృష్టిసారించాలి

బొండపల్లి: రబీ సాగుపై రైతులు దృష్టిసారించాలని జిల్లా ఏరువాక ముఖ్య శాస్త్రవేత్త కె. లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులు, సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు.

కాలువ నిర్మాణానికి భూమి పూజ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని జగన్నాథ రాజుకాలనీలో రూ.10 లక్షల గ్రామీణ ఉపాధి హామీ నిధులతో సిమెంట్ కాలువ నిర్మాణానికి ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష, సర్పంచి మంగళగిరి సుధారాణి శుక్రవారం భూమి పూజ చేశారు. నాయకులు మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాయిలో విశాఖపట్నంలో జరిగిన మహిళల కబడ్డీ పోటీల్లో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వి.లావణ్య, ఎల్.సంతోషి, డి.హేమమాలిని, ఇ.వరలక్ష్మి, డి.భార్గవి, నిఖిత, డి.అంజలి సత్తా చాటారు. ప్రధానాచార్యుడు డా.పీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపల్ ఎం. రమేష్‌కుమార్, వ్యాయామ సమన్వయకర్త కె.జ్వాలాముఖి తదితరులు విద్యార్థులను అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు



ఆలోచన మెరిసింది



రాజాం పట్టణంలోని దోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ రచనలతో ప్రతిభ చాటారు. ఆర్.లహరి (8వ తరగతి), వై.రాజేశ్వరి (10వ తరగతి), డి.కీర్తి (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎన్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు లావేటి గోవిందరావు, పి.వీరన్నాయుడు, ఎ.స్వామిబాబు, కె. సత్యనారాయణ, డి.లీలావతి, ఎన్.ఉషా, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆర్.శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, రాజాం

పుల్లేరువలస కష్టాలు.. పట్టని పాలకులు

బొబ్బిలి పురపాలక సంఘం పరిధి మల్లంపేట వార్డులోని పుల్లేరువలస గిరిజన గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. 25 ఏళ్ల కిందట మంజూరు చేసిన పక్కా గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. స్లాబు పెచ్చులు ఊడిపోతున్నాయి. గిరిజనులు వాటి కిందనే తలదాచుకుంటున్నారు. తాగునీటి పైపులైన్లు లేవు. బోరునీరే దిక్కు. కాలువలు, రహదారులు లేకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. బోర్ల చుట్టూ అపరిశుభ్రత కనిపిస్తోంది. గ్రామానికి పొలం గట్ల మీదుగా వెళ్లాలి. చినుకుపడితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. అధికారులు గ్రామం వైపు వచ్చిన సందర్భాలు తక్కువని, అందుకే సమస్యలు తెలియడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పురపాలిక కమిషనర్ రామలక్ష్మి మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేస్తున్నామని, ఆపై నిధుల కేటాయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి


గ్రామానికి వెళ్లేందుకు పొలం గట్లే దిక్కు..


బోరు చుట్టూ అపరిశుభ్రంగా..

రాష్ట్రస్థాయికి ఎంపిక

చీపురుపల్లి, గుర్ల: చీపురుపల్లి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.శైలజ అండర్-17 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రహీనా బేగం చెప్పారు. ● పాలవలస ఉన్నత పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ రామకృష్ణ తెలిపారు.



పశుగణనకు సహకరించాలి

చీపురుపల్లి, బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, తెర్లాం, న్యూస్‌టుడే: అఖిల భారత 21వ పశుగణన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలను చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు రాజాంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. పశువుల సంఖ్య లెక్కించడానికి భారత ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు చేపడుతుందని పశుసంవర్ధకశాఖ చీపురుపల్లి సహాయ సంచాలకులు డా. ఆర్. శారద వివరించారు. ● ప్రతిరోజు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గణన చేపడతారని, రైతులు సహకరించాలని వైద్యాధికారులు సతీష్, సుధాకర్ అన్నారు. ● రామభద్రపురం సచివాలయంలో తెదేపా రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ కరపత్రాలను విడుదల చేశారు. ● బాడంగి మండలంలో గణన ప్రారంభమైంది. ఎరుకులపాకలో తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాలవలస గౌరు, సర్పంచి పార్వతి కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ● పశుగణనకు రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని పశుసంవర్ధకశాఖ డీడీ రాజగోపాల్ కోరారు. తెర్లాంలో ఆయన మాట్లాడారు. గణనపై రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

సృజనకు పదును



బొబ్బిలి పట్టణంలోని శ్వేతాచలపతి సంస్థానం ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటారు. శంబంగి ప్రవల్లిక (9వ తరగతి), తేలు వర్షిణి (10వ తరగతి), పువ్వల వెంకట గిరీష్ రఘునాథ (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్ ఫ్రాన్సిస్ జార్జ్, వైస్ ప్రిన్సిపాళ్లు జి.రవికుమార్, జోసఫ్ కె.జె, సమన్వయ కర్త శ్రీనివాస శర్మ, సిబ్బంది కె.సతీష్, ఆర్.అరుణ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు పి.వి.ఎల్.ఎన్ సాయిబాబా పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.
– న్యూస్‌టుడే, బొబ్బిలి



96 మందికి ఉద్యోగాలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్, ప్రభుత్వ ఐటీఐ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించారు. 320 మందికి పైగా హాజరుకాగా 96 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రమణారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంతకుమార్ కిశోర్ మాట్లాడారు. యంగ్ ఇండియా, జస్ట్ డయల్, టాటా అడ్వాన్స్, పేటీఎం వంటి కంపెనీలు హాజరయ్యాయన్నారు. ప్లేస్‌మెంటు అధికారి భాస్కర్, జిల్లా ఉపాధి కల్పన సిబ్బంది యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ రమణారావుకు జాబితా అందజేస్తున్న నైపుణాభివృద్ధి అధికారి ప్రశాంతకుమార్ కిశోర్



ద్వాక్రా బజారు ప్రారంభం

రాజాం: మెప్మా ఆధ్వర్యంలో రాజాం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా బజారును శనివారం ఉదయం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రారంభిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

డీఎస్పీ పరిశీలన

రాజాం: పట్టణంలోని బాబానగర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బి.యశోద కేసు దర్యాప్తులో భాగంగా చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు మృతురాలి ఇంటిని శుక్రవారం పరిశీలించారు. సీఐ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన

బొబ్బిలి: సంఘం వీధిలో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మించొద్దని శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేశారు. కార్మికులకు కేటాయించిన స్థలంలో నిర్మాణాలు వద్దని సిటు జిల్లా అధ్యక్షుడు శంకరరావు డిమాండు చేశారు. పట్టాలు ఇవ్వకుంటే స్థలంలో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

ఇద్దరికి గాయాలు

వంగర: తలగాం సమీపంలో కె. గౌరీశ్వరరావు, పి.రాంబాబు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలవగా ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌శంకర్ చెప్పారు.

ఇసుక లారీ స్వాధీనం

బొబ్బిలి గ్రామీణం: పారాది వద్ద వేగావతి నది నుంచి మెరకముడిదాం మండలానికి ఇసుక తరలిస్తున్న టిప్పరు లారీని శుక్రవారం తెల్లవారు జామున ఏఎస్సై భాస్కరరావు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. చోదకుడు త్రినాథపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాలీబాల్‌లో ప్రథమస్థానం

రాజాం: డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల పోటీల్లో రాజాం జీసీఎస్ఆర్ కళాశాల పురుషుల జట్టు వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ పురుషోత్తమ నాయుడు చెప్పారు.

నాటుసారాతో అరెస్టు

వంగర: మగ్గూరు కూడలి వద్ద గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 3.5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు.

అతిసారం లక్షణాలు

పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం): డొంకాడ, బురదపాడు గ్రామాలకు చెందిన పలువురు వృద్ధులు అతిసారం లక్షణాలతో పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో చేరారు. వారికి ప్రమాదం లేదని వైద్యాధికారి పల్లవి చెప్పారు.





రూ.60 వేలు విరాళం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు తనకు ప్రభుత్వం ఇచ్చిన పది నెలల గౌరవ వేతనం రూ. 60 వేలు మొత్తాన్ని మృతదేహాన్ని భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్ కొనుగోలుకు సహాయ్ స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళంగా ఇచ్చారు. సహాయ్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 23న మృత దేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు మహాప్రస్థానం పేరిట అంతిమయాత్ర రథాన్ని ప్రారంభించింది. దీనికి అనుబంధంగా ఉపయోగపడుతుందని ఫ్రీజర్ బాక్స్ కొనుగోలు కోసం జడ్పీటీసీ సభ్యుడు శుక్రవారం సంస్థ ప్రతినిధులు వాకాడ గోపి, ఉప్పు శ్రీనివాసరావు, శివుకు కాంతారావు తదితరులకు విరాళం అందజేశారు.


విరాళం అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మద్యం దుకాణం వద్దని ఆందోళన

వంగర: మడ్డువలస గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు, మహిళలు శుక్రవారం ఆందోళన చేశారు. మద్యం దుకాణం సమీపంలో జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల, రామమందిరం ఉన్నాయని గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు.


నినాదాలు చేస్తున్న మహిళలు

గ్రామాలకు ట్యాంకర్లతో నీరు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి నియోజకవర్గంలో అతిసారం బారినపడిన గ్రామాలకు చీపురుపల్లి పట్టణం నుంచి ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మండల పరిషత్తు కార్యాలయం వెనుక ఉన్న భూతల జలాశయాల నుంచి 20 ట్యాంకర్లతో గరివిడి, గుర్ల మండలాల్లోని జగన్నాథపురం, గూడేం, నాగళ్లవలస, గుర్ల, పున్నపురెడ్డిపేట తదితర గ్రామాలకు ట్యాంకర్లను నింపి సరఫరా చేస్తున్నారు. దీని కోసం సిబ్బందికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు.

చర్యలకు డిమాండ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని మిలట్రీకాలనీ పక్కన ఉన్న చెరువులో శుక్రవారం రాత్రి కొందరు గ్రావెల్ వేసి కప్పారని, చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఒమ్మి రమణ, కె.అప్పన్న డిమాండు చేశారు. అధికారులు ఆ స్థలంలో ప్రభుత్వ స్థలమని బోర్డులు పెట్టారని, వాటిని తీసేసి గ్రావెల్ వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు ఎం.శ్రీను చెరువును కప్పుతున్న వారిని హెచ్చరించారు.



విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

వైద్య కళాశాలల్లో క్యాన్సర్, కిడ్నీ రోగులకు సేవలందించాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: విజయనగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సేవలను విస్తృతం చేయాలని కళాశాల ప్రధానాచార్యులు కె.పద్మలీలను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం ఆమెను కలిసి జయప్రకాశ్ నారాయణ రాసిన 'ఆరోగ్యం' పుస్తకాన్ని అందజేశారు. వైద్యకళాశాల కోసం తమ పార్టీ అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. జిల్లాలో క్యాన్సర్ బాధితులు, కిడ్నీ రోగులకు సేవలు అందించాలన్నారు.



పద్మలీలతో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కృష్ణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు

డెంకాడ, న్యూస్‌టుడే: మండలంలోని గునుపూరుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు సారిపల్లి గౌరీశంకర్ తెలిపారు. అండర్-14 విభాగంలో జుత్తుక తేజస్విని, రవిచంద్ర, అండర్-17 విభాగంలో దొప్ప మణిచంద్రతేజ, వి.నవ్య రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీలకు జిల్లా జట్టు తరఫున ఎంపికైనట్లు తెలిపారు.



స్ఫూర్తిదాయకం.. చిన్నారుల వ్యాసం

విజయనగరంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో టి.తేజస్విని (తొమ్మిదో తరగతి), డి.ప్రణతి (పదో తరగతి), డి.మహేష్, ఎన్.జాన్ బెర్నాడ్ (పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానాచార్యుడు డి.రాంబాబు, ఉపాధ్యాయులు ఎస్.అదికృష్ణ, ఎం.శ్రీనివాసరావు, సీహెచ్.జయలక్ష్మి, జి.సుమ కుమారి, ఎస్.కె.షామీజాన్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం



సమస్యల సవారీతో ఉక్కిరిబిక్కిరి

పద్మావతినగర్‌లో..

పద్మావతినగర్ ఆరులైన్లు, వెంకటేశ్వరకాలనీ, గాయత్రీనగర్‌లో పక్కా కాలువలు, రహదారులు లేవు. ఒకటో లైనులో వీధి దీపాలు వెలగడం లేదు. ఇక్కడ వర్షం పడితే నీరు రోడ్లపైనే చేరుతోంది. నటరాజ్ కాలనీలో పార్కు స్థలం ఆక్రమణకు గురైంది. వసంత విహార్ అపార్టుమెంట్లలో పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. రెండు డంపర్ బిన్లు పాడయ్యాయి. ఎక్కడికక్కడే వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అయిదో లైను అప్రోచ్ రోడ్డు గుంతలు పడింది. పెద్దచెరువు అదనపు నీటి కాలువ భగవాన్‌నగర్, వినాయకనగర్, పద్మావతినగర్, నటరాజ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల మీదుగా వెళుతోంది. ఆక్రమణలకు గురికావడంతో సమీప ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి.



పద్మావతినగర్‌లో పారిశుద్ధ్యం తీరు ఇదీ..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరంలో సమస్యల సవారీ చేస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పన్నులు కడుతున్నా గత అయిదేళ్ల నుంచి మౌలిక సదుపాయాలు కరవయ్యాయని పలువురు వాపోతున్నారు. రహదారులు, కాలువలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సమస్యలతో సతమతం అవుతున్నారు. ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ఆర్టీసీ కాలనీలో దెబ్బతిన్న కల్వర్టు

అక్కడా అంతే..

ఎంఎస్ఎన్, పీఎస్ఆర్ కాలనీల్లో చెత్త పేరుకుపోతోంది. కాలువల్లో మురుగు తొలగడం లేదు. కొన్ని చోట్ల రెండు, మూడు నెలల నుంచి వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. శ్రీనివాసనగర్ దారిలో చెత్త పోగైంది. డంపింగ్ యార్డును తరలించాలి. కణపాక, ఆర్టీసీ కాలనీ, శాంతి, క్రాంతినగర్‌లో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులున్నాయి. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ❖ విద్యుత్తు సమస్యలు లేకుండా చూస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ త్రినాధరావు చెప్పారు.

మంత్రులను కలిసిన సుబ్బలక్ష్మి



శృంగవరపుకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టరు, మండల ఉపాధ్యక్షురాలు ఇందుకూరి సుబ్బలక్ష్మి శుక్రవారం ఉదయం విశాఖలో మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

కొత్తవలస, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-19 బాలుర హ్యాండ్ బాల్ పోటీలు కొత్తవలసలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. డీఈఓ ఎన్.భీమశంకరరావు, డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కడారి రాజు, జీసీడీవో టి.ఎం.ఫ్లోరెన్స్ పావురాలు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఎస్జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి పి.వి.ఎల్.ఎన్.కృష్ణ, ఎస్జీఎఫ్ అండర్-14 జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు, హ్యాండ్‌బాల్ కార్యదర్శి వి.మల్లేశ్వరరావు, పరిశీలకులు డి.ఆర్.రమ, కె.సోమశేఖర్, ప్రిన్సిపాళ్లు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



పావురాలు ఎగురవేస్తున్న డీఈఓ భీమశంకరరావు తదితరులు

కారిపోతున్న భవనాలు



నాడు-నేడు నిధులతో పైకప్పుల మరమ్మతులు చేసిన అంగన్‌వాడీ భవనాలు తొమ్మిది నెలలకే మళ్లీ కారిపోతున్నాయి. ఖాసాపేట, రంగరాయపురం అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా రూ.2.50 లక్షలు మరమ్మతులకు కేటాయించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు భాగ్యలక్ష్మిని వివరణ కోరగా సమస్య గురించి ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. ఏఈ రామచంద్రరావుతో ప్రస్తావించగా.. ఖాసాపేట పైకప్పు కారిపోతోందని చెప్పారని, రంగరాయపురం గురించి ఎవరూ చెప్పలేదన్నారు.

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

తాగునీటికి విలవిల



శృంగవరపుకోట పట్టణంలో గాంధీనగర్‌లో మంచినీటి సరఫరా ఆగిపోయి నెలన్నర రోజులైనా నేటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైను ఎక్కడో బ్లాక్ అయిందని, తవ్వి చూస్తున్నా తెలియడం లేదని పంచాయతీ ప్లంబర్లు చెబుతున్నారు. గాంధీనగర్ వాసులకు మాత్రం మంచినీటి కష్టాలు తీరలేదు. పంచాయతీ ఈవో ఆనంద్ వద్ద ప్రస్తావించగా కొత్తపైపు లైను వేయిస్తామన్నారు. రక్షిత మంచినీటి విభాగం జేఈ ఝాన్సీ మాట్లాడుతూ వెంటనే కొత్త పైపు లైను వేసి కుళాయిల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, శృంగవరపుకోట

పశుగణన ప్రారంభం



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కర్రోతు, అధికారులు

పూసపాటిరేగ (భోగాపురం), లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం పోలిపల్లి పశు వైద్యశాలలో పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి గోడ కరపత్రులను ప్రారంభించారు. పశు వైద్యులు కమలకుమారి, శ్రీకాంత్, రామరాజు, రాజేశ్వరి పాల్గొన్నారు. ● కొత్త పథకాల రూపకల్పనకే ప్రభుత్వం పశుగణన చేపడుతోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మల్లివీడులో గణన నిర్వహించే సిబ్బందికి కిట్లను పంపిణీ చేశారు. కొత్తవలస, ఎస్.కోట ఏడీలు గంగాధర్, చలపతిరావు, వైద్యాధికారులు గాయత్రి, తులసి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న కామేశ్వరరావు

అయ్యన్నపేట/నుయారికడలి, న్యూస్‌టుడే: గుర్లలో డయేరియాతో మరణించిన వారికి రూ.25 లక్షల పరిహారం అందించాలని ప్రజారోగ్య ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో ప్రజారోగ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. గుర్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని కోరారు. ఎన్.లక్ష్మణరావు, తమ్మినేని సూర్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, సీహెచ్.వెంకటేష్, బి.హరీష్, ఎన్.జగన్నాథం, పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ బంగ్లాలో ప్రజాదర్బార్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరంలోని అశోక్ బంగ్లాలో శుక్రవారం సాయంత్రం ప్రజా దర్బార్ జరిగింది. నగరపాలిక పరిధిలోని 31 నుంచి 50 వరకు డివిజన్లకు చెందిన ప్రజల నుంచి ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

వినికిడి పరికరాల అందజేత

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: ఘోష ఆసుపత్రిలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో స్వరూప్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు చెవిటి, మూగ దివ్యాంగులకు శుక్రవారం వినికిడి పరికరాలను అందజేశారు. ఆర్బీఎస్‌కే సమన్వయకర్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 120 మంది పిల్లలకు 240 పరికరాలు పంపిణీ చేశామన్నారు. వైద్య నిపుణులు అనూష, స్వరూప, ట్రస్టు డైరెక్టర్ పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న ఆర్బీఎస్‌కే సమన్వయకర్త సుబ్రహ్మణ్యం

29న రక్తదాన శిబిరం.. విజయనగరం రింగురోడ్డు: రతన్ టాటా జ్ఞాపకార్థం గాంధీ ఇండ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 29న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఎంవీఎన్ వెంకటరావు తెలిపారు. శుక్రవారం గోడప్రతులను ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై వ్యాసరచన

పూసపాటిరేగ, (భోగాపురం), న్యూస్‌టుడే: అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భోగాపురం మోడల్ స్కూల్, పూసపాటిరేగ పోలీసు రాజాలో శుక్రవారం సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్రపై సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఎస్ఐలు దుర్గాప్రసాద్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోనాడలో ప్రభుత్వ భూమి పరిశీలన



భూములు పరిశీలిస్తున్న ఆదినారాయణ తదితరులు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండలంలోని కోనాడలో సర్వే నంబరు 124లో 140 ఎకరాల ఉప్పు తయారీ కేంద్ర సంస్థ భూములను రాష్ట్ర మారిటైం ప్రత్యేక అధికారి ఆదినారాయణ, జిల్లా రెవెన్యూ సర్వే అధికారి డీఆర్ ప్రసాద్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రికార్డులు ఆధారంగా ఈ భూములను పోర్టుకు స్వాధీనానికి శుక్రవారం పరిశీలించారు. మండల సర్వేయరు గణపతిరావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించండి

పూసపాటిరేగ, (భోగాపురం) న్యూస్‌టుడే: భోగాపురం మండలంలో విద్యుత్తు సమస్యలపై జడ్పీ వైస్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు శుక్రవారం ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి వినతిపత్రం అందజేశారు. విజయనగరంలోని జరిగిన జిల్లా పరిషత్తు సమావేశంలో మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తీరప్రాంత గ్రామాల్లో ఉప్పు గాలికి కేబుళ్లు, కండక్టర్లు, విద్యుత్తు స్తంభాలు మరమ్మతులకు గురయ్యాయని, కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రేమకుమార్‌కు సత్కారం

విజయనగరం విద్యావిభాగం: డీఈవోగా పదవీ విరమణ పొందుతూ బదిలీపై వెళుతున్న ఎన్.ప్రేమకుమార్‌ను శుక్రవారం విద్యాశాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్త డీఈవో మాణిక్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉప సీఈవోకు సన్మానం

విజయనగరం అర్బన్: బదిలీపై వెళుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్‌ను శుక్రవారం జడ్పీ సమావేశమందిరంలో సన్మానించారు. సీఈవో సత్యనారాయణ, ఎంపీడీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణంరాజు, రామకృష్ణ, జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మురళీ, రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని పెదగుడిపాల ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో సీహెచ్.

సంక్షిప్త సమాచారం

సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. పిల్లల వైద్యాన్ని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆరా తీశారు.

వ్యాధులపై అప్రమత్తం

పూసపాటిరేగ: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వర్ అన్నారు. అల్లాడపాలెం పంచాయతీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పంట మార్పిడి అవసరం

జామి: జామి రైతు సేవా కేంద్రంలో ఆయిదు మండలాల వ్యవసాయ సహాయకులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. విజయనగరం శిక్షణ కేంద్రం ఏడీఏ భారతి, కొత్తవలస ఏడీఏ ఎల్.విజయ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పైపు రైతులు మళ్లేలా చేయాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణ పనులు

కొత్తవలస, న్యూస్‌టుడే: దేశపాత్రునిపాలెం పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) సహాయ కమిషనర్ నాగరాజు పర్యవేక్షించారని పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణారావు శుక్రవారం తెలిపారు. మంగళపాలెం పరిమిత ఎత్తు భాగాల్లో వంతెన అనుసంధాన రోడ్డు పక్క నివాసాల వెనక కాలువలో పూడికతీత పనుల్ని క్షేత్రస్థాయిలో ఆయన చూశారని చెప్పారు. చింతలపాలెంలో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారని వివరించారు.



కార్యదర్శితో మాట్లాడుతున్న పరిశీలకుడు నాగరాజు

అగ్నిపథ్‌కు ఎంపిక

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మూడో సంవత్సరం బీఎస్సీ (ఎంపీసీఎస్) విద్యార్థి కె.గణేష్ అగ్నిపథ్‌కు ఎంపికైన సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రిన్సిపల్, సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. ప్రిన్సిపల్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ గణేష్‌ను ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి.సుధీర్, ఎన్సీసీ అధికారి పలిఖాన్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

విద్యార్థులతో ఓపెన్ హౌస్

లక్కవరపుకోట, వేపాడ, న్యూస్‌టుడే: ఎల్.కోట ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎస్ఐ నవీన్ పడాల్ శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. విద్యార్థులందరినీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆయుధాలను పరిచయం చేసి, ఉపయోగాలను వివరించారు. ❖ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్టేషను విధులు, బాధ్యతలను వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి వివరించారు.



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్ఐ నవీన్‌పడాల్, సిబ్బంది